క్లుప్తంగా

గోష్పాదేశ్వరస్వామికి లక్ష పత్రి పూజ



కొవ్వూరులో సుందరేశ్వర స్వామికి లక్షపత్రి పూజ చేస్తున్న పండితులు

కొవ్వూరు: స్థానిక సంస్కృత పాఠశాల ప్రాంగణంలోని గోష్పాదేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. గోష్పాద క్షేత్రంలోని సుందరేశ్వరస్వామికి ఉదయం మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు చేశారు.అనంతరం లక్షపత్రి పూజల నిర్వహించారు. మాఘ మాసం ఆదివారం కావడంతో సూర్య భగవానుడికి ప్రత్యేక పూజలు చేశారు.

తాటాకిల్లు దగ్ధం



అనంతపల్లి శివారు కృష్ణమ్మగూడెంలో కాలిపోయిన తాటాకిల్లు

నల్లజర్ల: అనంతపల్లి శివారు కృష్ణమ్మగూడెంలో శనివారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం సంభవించింది. ఒంటరిగా ఉంటున్న ఉప్పాటి గంగకు చెందిన తాటాకిల్లు దగ్ధమైంది. మంటలు ఎగిసి పడడంతో గంగ బయటకు వచ్చేసింది. ఇంట్లో ఉన్న కూలి సొమ్ము రూ ఐదు వేలు, దుస్తులు, బీరువా, మంచం తదితర సామగ్రి కాలిబూడదయ్యాయని గ్రామస్తులు తెలిపారు. ఈ ఘటనలో ఆమె చేతిపై స్వల్ప గాయమైంది.

గ్రామాల్లో కోతుల బెడద



దేవరపల్లిలో ఓ ఇంటిపై చేరిన కోతులు

దేవరపల్లి: గ్రామాల్లో కోతుల బెడద ఎక్కువగా ఉంది. మండలంలోని పలు గ్రామాల్లో గుంపులు, గుంపులుగా కోతులు సంచరించడంతో ప్రజలు భయభ్రాంతులవుతున్నారు. ఇళ్లల్లోకి చొరబడి వంట గదుల్లోని నిత్యావసర సరుకులు ఎత్తుకు పోతున్నాయని, అడ్డుకుంటే దాడి చేసి గాయపరుస్తున్నాయని మహిళలు వాపోతున్నారు. బందపురం, దేవరపల్లి, యర్నగూడెం గ్రామాల్లో కోతుల బెడద ఎక్కువగా ఉందని ఆయా గ్రామాల ప్రజలు తెలిపారు. రోడ్లపై ఆటలాడుతున్న పిల్లలపై కోతులు దాడి చేసి తీవ్రంగా గాయపరుస్తున్నాయని ఆందోళన చెందుతున్నారు. గ్రామ పంచాయతీ అధికారులు కోతుల పట్టించి అటవీ ప్రాంతాలకు తరలించి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

కలవచర్లలో షిర్డీ సాయిబాబా మందిర వార్షికోత్సవం



షిర్డీ సాయిని దర్శించుకుంటున్న వైఎస్సార్ సీపీ నాయకులు, భక్తులు

నిడదవోలు రూరల్: కలవచర్ల గ్రామ షిర్డీ సాయిబాబా మందిరం 11వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు బోనేపల్లి సుబ్బారావు, ఉమాదేవి దంపతుల పర్యవేక్షణలో పంచామృతాలతో సాయిబాబాకు అభిషేకాలు చేశారు. అనంతరం గ్రామ వీధుల్లో బాబా పల్లకీసేవ నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు పులిహోర, చక్కెర పొంగళి ప్రసాదంగా అందజేశారు. అనంతరం సాయిగణేష్ ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యుల పర్యవేక్షణలో భారీ అన్నసమారాధన చేశారు. పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. మాజీ ఎంపీపీ మన్యం సూర్యనారాయణ, నిచ్చెనకోళ్ల సాయిబాబా, రామకృష్ణ, వీరమనేని సుబ్బారావు, లక్ష్మణ్‌బాబు, శ్రీనివాస్, కె.శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఈదమ్మ తల్లి ఉత్సవాలు



చాగల్లులో రజకుల కుల దేవత ఈదమ్మతల్లి

చాగల్లు: చాగల్లులో రజకుల ఈలవేల్పు అయిన ఈదమ్మ తల్లి ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. గురువారం ప్రారంభమైన ఉత్సవాలను నాలుగు రోజుల పాటు వైభవంగా నిర్వహించారు. అమ్మవారి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు.ఆదివారం అమ్మవారికి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, భక్తులు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్తు దీపాలంకరణతో సుందరంగా అలంకరించారు.

నాడు దైన్యం.. నేడు ధైర్యం

- కార్పొరేట్ స్థాయి సౌకర్యాలతో తాడిమళ్ల పీహెచ్‌సీ
- రూ.1.50 కోట్ల వ్యయంతో సకల హంగులతో కొత్త భవనం
- తీరనున్న రోగుల కష్టాలు



తాడిమళ్లలో కొత్తగా నిర్మించిన పీహెచ్‌సీ భవనం (నేడు)



తాడిమళ్లలో శిథిలావస్థలో ఉన్న పాత పీహెచ్‌సీ భవనం (నాడు)

నిడదవోలు రూరల్: ప్రజలకు మేలు చేయాలన్న చిత్తశుద్ధి పాలకుల్లో ఉంటే అడ్డన్నదే ఉండదు. గ్రామీణులకు నాణ్యమైన వైద్యసేవలు అందించేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో పీహెచ్‌సీల్లో వైద్య సేవలు అరకొరగానే అందేవి. పీహెచ్‌సీల్లో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేవారు కాదు. ఆసుపత్రి భవనాలు కూడా శిథిలావస్థకు చేరాయి. ఒకవేళ ఆసుపత్రికి వెళ్లి పరిసరాల్లో కాసేపు నిలబడాల్సి వచ్చినా నరకప్రాయయమే. ఇలా ఎన్నో ఏళ్లుగా పేదలకు నాణ్యమైన వైద్యసేవలు అందని ద్రాక్షగానే మిగిలిపోయాయి. గత ప్రభుత్వ హయంలోని దుర్భర పరిస్థితులకు చెక్ పెడుతూ నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల భవనాలను ప్రభుత్వం నిర్మిస్తోంది. దీనిలో భాగంగా నిడదవోలు మండలం తాడిమళ్లలో రూ.1.51 కోట్ల వ్యయంతో నూతన పీహెచ్‌సీ భవనాన్ని నిర్మించారు. ఈ పీహెచ్‌సీ పరిధిలోని 8 ఉప కేంద్రాలకు సంబంధించిన 13 గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందనున్నాయి.త్వరలోనే ఈ భవనాన్ని ప్రారంభిస్తారు.

నాడు బిక్కుబిక్కు మంటూ సేవలు

అనారోగ్యంతో వైద్యం కోసం తాడిమళ్ల పీహెచ్‌సీకి వచ్చే రోగులకు చికిత్సతో పాటు ధైర్యం చెప్పవలసిన వైద్యులే శిథిలావస్థకు చేరిన భవనంలో భయం భయంగా చికిత్స అందించేవారు. అత్యవసర సేవలు అవసరమైన వారిని సైతం ఇన్‌పేషెంట్లుగా చేర్చుకోలేని పరిస్థితి. ఆసుపత్రి చుట్టూ పిచ్చిమొక్కలు, గడ్డి పెరిగిపోయి ఉండేవి. పాములు, తేళ్ల వంటి విషజీవులు ఆవరణలో సంచరించేవి. దాంతో ఆసుపత్రి సిబ్బంది భయాందోళన చెందేవారు. పీహెచ్‌సీ పరిధిలో సిబ్బంది, ఆరోగ్య, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలకు సమావేశాలు నిర్వహించే భవనం కూడా ఇరుకుగానే ఉండడంతో కూర్చొనేందుకు ఇబ్బందులు పడేవారు. సిబ్బంది క్వార్టర్స్ భవనాలు పూర్తిగా శిథిలమయ్యాయి. దీంతో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు ఆసుపత్రిని పరిశీలించి తాడిమళ్ల పీహెచ్‌సీకి నూతన భవనం నిర్మించేందుకు చర్యలు చేపట్టారు. నిధులు మంజూరై నిర్మాణం పూర్తికావడంతో త్వరలోనే ప్రారంభించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

అన్ని వసతులతో..

తాడిమళ్ల నూతన పీహెచ్‌సీ భవనాన్ని ఆధునిక వసతులతో నిర్మించారు. ఇందులో మహిళలకు, పురుషులకు వేర్వేరుగా జనరల్ వార్డులు, ఆపరేషన్ థియేటర్, ప్రసూతి గది, ఇద్దరు వైద్యాధికారులకు ప్రత్యేక గదులు, స్టాఫ్ నర్సుల కోసం గదులు, మెడికల్ స్టోర్, ల్యాబ్, రోగులకు మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. తాగునీటి సౌకర్యం కూడా కల్పించారు. అంతేగాకుండా ఆసుపత్రి ప్రాంగణంలో ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా మొక్కలు నాటేందుకు చర్యలు చేపట్టారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తాం



ప్రస్తుతం ఉన్న భవనం శిథిలావస్థకు చేరింది. తగినంత సిబ్బంది అందుబాటులో ఉన్నప్పటికీ ప్రజలకు పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందించలేకపోతున్నారు. ప్రభుత్వం నూతన భవనం నిర్మించడంతో త్వరలోనే మెరుగైన వైద్యసేవలు అందుబాటులోకి తీసుకువస్తాం.

– జి.సుధీర్‌కుమార్, పీహెచ్‌సీ వైద్యాధికారి, తాడిమళ్ల

ఆసుపత్రి భవన నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ



తాడిమళ్లతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందించేందుకు నిడదవోలు ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పీహెచ్‌సీ నూతన భవనాన్ని నిర్మించారు. పీహెచ్‌సీతో పాటు గ్రామాల్లో వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు, ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాల ద్వారా ప్రజలకు కార్పొరేట్ స్థాయిలో వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం అభినందనీయం.

– తిరుమళ్ల భాగ్యలక్ష్మి, ఎంపీపీ, నిడదవోలు

యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గం ఎన్నిక

ద్వారకాతిరుమల: యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గ ఎన్నిక స్థానిక యూటీఎఫ్ భవనంలో ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జి పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ మండల నూతన అధ్యక్షుడిగా బి.జయరాజు, సహాధ్యక్షుడిగా పి.రాంబాబు, గౌరవాధ్యక్షుడిగా పి.వరప్రసాద్, మహిళా అధ్యక్షురాలిగా పి.మేరీ, ప్రధాన కార్యదర్శిగా బీవీ రవీంద్ర, కోశాధికారిగా కట్టా శ్రీనివాసరావు, కార్యదర్శులుగా ఎం.జాన్సన్, కె.ప్రభాకరరావు, జి.చిన్నికృష్ణ, కె.బెన్నీ, పి.సారథి, జేవీకే ప్రసాద్, ఎన్.లక్ష్మి, బి.రవితేజ, ఆర్.అప్పయ్య, కాళి శ్రీనివాస్, ఆడిట్ కన్వీనర్‌గా ఎం.బాలసురేష్ నియమితులయ్యారు. అలాగే జిల్లా కౌన్సిలర్లుగా బి.జయరాజు, బీవీ రవీంద్ర, కె.దుర్గాంబ, జి.దేవానందరావు, సీహెచ్ జగన్మోహన్‌రావు, కె.శ్రీవిద్య, జి.కృష్ణ, కె.బెనర్జీ, ఎం.నారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం వారు ప్రమాణస్వీకారం చేశారు. ఎన్నికల అధికారిగా యుటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పీవీ నరసింహారావు, ఎన్నికల పరిశీలకుడిగా జిల్లా అధ్యక్షులు రవికుమార్ వ్యవహరించారు.

ట్రస్ట్ బోర్డు సభ్యునికి సత్కారం

గోపాలపురం: ద్వారకాతిరుమల ఆలయ పాలక మండలి సభ్యుడిగా నియమితులైన మండలంలోని పెద్దాపురం గ్రామానికి చెందిన తానింకి గంగరాజును ఆదివారం గోపాలపురం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు పెనుగొండ బాలాజీ సత్కరించారు. కార్యక్రమంలో ముల్లంగి శ్రీనివాసరెడ్డి, పెనుగొండ శ్రీనివాస్ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆరికిరేవులలో ఉచిత నేత్ర వైద్య శిబిరం



ఆరికిరేవులలో కంటి పరీక్షలు చేస్తున్న నిపుణులు

కొవ్వూరు: మండలంలోని ఆరికిరేవుల గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. లయన్స్ క్లబ్ కొవ్వూరు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో నిడదవోలు రాజేశ్వరీ రామకృష్ణ లయన్స్ కంటి ఆసుపత్రి వైద్యులు 62 మందికి నేత్ర పరీక్షలు చేశారు. వారిలో 30 మంది కళ్లజోళ్లు అవసరమని వైద్యులు నిర్ధారించారని లయన్స్ క్లబ్ కొవ్వూరు శాఖ అధ్యక్షుడు కంఠమణి రామకిషోర్ తెలిపారు. తమ క్లబ్ తరపున ఉచితంగా కళ్లజోళ్లు అందజేయనున్నట్టు చెప్పారు. పరీక్షలు చేయించుకున్న వారిలో 17 మందికి నిడదవోలులోని కంటి ఆసుపత్రిలో ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయనున్నట్లు తెలిపారు. లయన్స్ క్లబ్ పూర్వపు అధ్యక్షుడు యనమదల సుబ్రహ్మణ్యం, బూరుగుపల్లి వెంకటేశ్వరరావు, పెనుమాక జయరాజు, గోలి వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

జి.కొత్తపల్లిలో..

ద్వారకాతిరుమల: లయన్స్ క్లబ్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో మండలంలోని జి.కొత్తపల్లి ఎంపీపీ పాఠశాలలో ఆదివారం ఉచిత గుండె, నేత్ర, జనరల్ మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్యులు పి.రితీష్, తేజస్వి, ఆదిత్యలు 150 మంది రోగులకు బీపీ, సుగర్, ఈసీజీ, ఎకో పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో జి.కొత్తపల్లి సర్పంచ్ కస్సే శ్రీహరి, లయన్స్ క్లబ్ జిల్లా నాయకులు ఎల్.వెంకటేశ్వరరావు, జిల్లా చైర్మన్ పులపా ఆనంద్‌కుమార్, క్లబ్ మండల అధ్యక్షుడు కారుమంచి మురళి, మానవత జిల్లా కార్యదర్శి ఎన్‌బీ వెంకటరావు, రేగంటి రాంబాబు, ఆలపాటి శ్రీనివాసరావు, దాసరి ఏసురత్నం, హాస్పిటల్స్ మేనేజర్ ఎం.సతీష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ జలకళతో రైతులకు మేలు



వైఎస్సార్ జలకళ బోరును ప్రారంభిస్తున్న ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ

గోపాలపురం: వైఎస్సార్ జలకళ పథకంతో మెట్ట రైతులకు ఎంతో మేలు జరుగుతుందని ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ అన్నారు. ఈ పథకం ద్వారా గంగోలు పంచాయతీ పరిధిలోని రాంపాలెం గ్రామంలోని కలిగొట్ల వెంకటేశ్వరరావు పొలంలో వేసిన బోరును ఎంపీపీ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల రైతుల పొలాల్లో 150 బోర్లు వేయించాలంటూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. వైఎస్సార్ జలకళ ద్వారా రైతుల ప్రతి ఎకరాకు నీరు అందుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, వైఎస్సార్ సీపీ మండల మాజీ కన్వీనర్ ఎస్‌కే ఖాదర్ వలీ, నాయకులు తానింకి గంగరాజు, ముల్లంగి శ్రీనివాసరెడ్డి, పీతల ప్రసాద్ బాబు, మండపాటి శ్రీను, కాకులపాటి శ్రీను, ఆకుల విష్ణు, పలువురు రైతులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీలను తొలగించాలి

దేవరపల్లి: స్థానిక మెయిన్ రోడ్డు నుంచి అంబేద్కర్ సెంటర్‌కు వెళ్లే రోడ్డు మలుపులో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. నూతన సంవత్సరం సందర్భంగా రోడ్డు మలుపులో పలు రాజకీయ పార్టీల నాయకులు ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. వాటి వల్ల మెయిన్ రోడ్డుపై వెళుతున్న వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయని ఆ ప్రాంత ప్రజలు తెలిపారు. పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఫ్లెక్సీలను తొలగించాలని కోరుతున్నారు.

మహా శివరాత్రికి చురుగ్గా ఏర్పాట్లు

- 16న స్వామివారి దివ్య కల్యాణం



గోలింగేశ్వర స్వామి వారు

నిడదవోలు: మహాశివరాత్రి పర్వదినానికి పట్టణంలోని పురాతన శివాలయాలు ముస్తాబవుతున్నాయి. అలాగే నియోజకవర్గంలోని అన్ని శైవక్షేత్రాల్లోనూ శివరాత్రి ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. పట్టణంలో స్వయంభూగా వెలసిన గోలింగేశ్వరస్వామి ఆలయం వద్ద, పట్టణ నడిబొడ్డున గల రాజరాజేశ్వరీ సహిత గోలింగేశ్వర స్వామి ఆలయం వద్ద, బాలా త్రిపుర సుందరీ సహిత సోమేశ్వరస్వామి వారి ఆలయం వద్ద, చిన కాశీరేవులోని పార్వతీదేవి సహిత నగరేశ్వరస్వామి వారి ఆలయం వద్ద ఈ నెల 16 నుంచి 20 వరకూ ఘనంగా నిర్వహించే మహశివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నారు.

గోలింగేశ్వర స్వామి వారి ఆలయంలో ...

పట్టణంలోని పురాతన గోలింగేశ్వర స్వామి వారి ఆలయంలో ఈనెల 16వ తేదీ రాత్రి ఏడు గంటలకు స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తారు. ఇందుకు ఏర్పాట్లను పూర్తి చేస్తున్నారు. 17న ఆలయంలో మహాన్యాస పూర్వక రుద్రాభిషకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు, ప్రత్యేక పూజలతో పాటు గ్రామోత్సవం నిర్వహిస్తారు. మహిళలు కుంకుమ పూజలు చేస్తారు. 18న మహాశివరాత్రి సందర్భంగా వేకువజాము రెండు గంటల నుంచి స్వామివారి దర్శనానికి భక్తులను అనుమతిస్తారు. రుద్రాభిషేకాలు, లక్షపత్రి పూజ, లక్ష కుంకుమార్చనలు, జాగరణ జరుగుతాయి. మహాశివరాత్రి నాడు రుద్రాభిషేకం చేసుకున్న భక్తులను తెల్లవారుజాము రెండు నుంచి 5 గంటల వరకూ ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రత్యేక దర్శనాలకు అనుమతిస్తామని ఆలయ వంశపారంపర్య అర్చకుడు శ్రీకాకుళపు వెంకటేశ్వరరావు, ఈఓ సోమాల శివ తెలిపారు.

దొండపూడిలో బైపాస్ రోడ్డు ఏర్పాటు చేయాలి



ఎంపీ భరత్‌రామ్‌కు వినతి పత్రం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ దొండపూడి నాయకులు

గోపాలపురం: జీలుగుమిల్లి – కొవ్వూరు జాతీయ రహదారి నిర్మాణంతో దొండపూడి గ్రామంలోని ప్రధాన రహదారిని నష్టపోవాల్సి వస్తోందని ఆ గ్రామస్తులు పేర్కొన్నారు. ప్రత్యామ్నాయంగా రెండు కిలోమీటర్ల పొడవునా బైపాస్ రోడ్డు నిర్మించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వైఎస్సార్ సీపీ దొండపూడి నాయకులు, గ్రామపెద్దలు ఆదివారం రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్, గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావులను కలిసి వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతిరెడ్డి నాగరాజు మాట్లాడుతూ దొండపూడి గ్రామం మధ్యలో నుంచి రోడ్డు విస్తరణ జరిగితే వందలాది కుటుంబాలు గృహాలు కోల్పోయి రోడ్డున పడతారన్నారు. అనేక మంది జీవనోపాధిని కోల్పోతారన్నారు. ఎంపీ, ఎమ్మెల్యేలను కలసిన వారిలో వైఎస్సార్ సీపీ నాయకులు పోల్నాటి సురేష్‌బాబు, సర్పంచ్ మల్లిపూడి అచ్చిబాబు, ఆర్యవైశ్య సంఘం నాయకుడు మద్దు వీరభద్రరావు తదితరులు ఉన్నారు.

గోపాలపురంలో అ'పూర్వ' సమ్మేళనం



గోపాలపురం జెడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థులు

గోపాలపురం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1997– 98 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఇదే పాఠశాలలో సమావేశమయ్యారు. గత స్మృతులను నెమర వేసుకున్నారు. పాఠశాలలో చదివిన రోజులు గుర్తుచేసుకొని ఒకరి యోగక్షేమాలు ఒకరు అడిగి తెసుకున్నారు. అప్పట్లో తమకు విద్య అందించిన ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు.

వాకర్స్ క్లబ్ సేవలను విస్తృత పరచాలి

- మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ
- క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



వాకర్స్ నూతన కార్యవర్గ సభ్యులను అభినందిస్తున్న మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ

నిడదవోలు: వాకర్స్ క్లబ్ సభ్యులు సామాజిక సేవలను మరింత విస్తృతం చేయాలని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. 2023 సంవత్సరపు వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవాన్ని స్థానిక కిరణా మర్చంట్స్ అసోసియేషన్ హాల్లో ఆదివారం రాత్రి నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ మాట్లాడుతూ ఆధునిక జీవనంలో ఉరుకులు, పరుగుల జీవితాలు గడుపుతున్న ప్రజలు తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ గంటసేపు వాకింక్ వ్యాయామాలు చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. నిడదవోలు వాకర్స్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా భాస్కర్ల రాజారామ్మోహన్‌రాయ్ (మోహన్), కార్యదర్శిగా చెన్నాపురపు రాజశేఖర్, కోశాధికారిగా గొళ్ళకూటి రాజేష్, సంయుక్త కార్యదర్శులుగా మేకా సురేంద్ర , జగతా రూపేంద్ర, జోలి వాకర్, గాడి కృష్ణ నియమితులయ్యారు. అలాగే మరో నలుగురు ఉపాధ్యక్షులుగా నియమితులయ్యారు. వారందరి చేత ఇన్‌స్టలేషన్ అధికారి సనగన కృష్ణమూర్తి ప్రమాణ స్వీకారం చేయించారు. వాకర్స్ వనితా క్లబ్ అధ్యక్షురాలుగా అమర శ్రీలక్ష్మి, కార్యదర్శిగా ఎ.వెంకటరమణ, కోశాధికారిగా ఎం.చంద్రకళ ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, వాకర్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఎలక్ట్ ప్రెసిడెంట్ వి.మురళీమనోహరరావు, ఎస్ఎం అక్బర్, ఆలమూరి రాజశేఖర్, పూసరపు వెంకటేశ్వరరావు, వీవీ లక్షణరావు, చెక్కా రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బల్బు కాదండోయ్ .. భానుడే



హోల్డర్ వద్ద హస్తమిస్తున్న సూర్యుడు



సూర్యాస్తమయం తర్వాత ఖాళీగా ఉన్న హోల్డర్

ఉషోదయం, సూర్యాస్తమయం వేళల్లో భానుడి అందాలు ప్రకృతి ప్రేమికులను కనువిందు చేస్తాయి. పనితనం కలిగిన ఫొటోగ్రాఫర్ సమయస్ఫూర్తితో ఫొటోలు తీయగలిగితే అవి గ్రాఫిక్స్‌ను మించిపోతాయి. అందుకు ఈ కింది చిత్రంలోని చిత్రం చక్కని ఉదాహరణ. కొవ్వూరు 23వ వార్డు, బండారు వారి వీధిలో ఉంటున్న ఉపాధ్యాయుడు పరస జగన్నాథరావు ఇంటిపై సూర్యాస్తమయం వేళ దర్శనమిచ్చిన దృశ్యమిది. ఆ భవనానికి వెనుకగా నైరుతి వైపు గల మరో భవనం వాటర్ ట్యాంకర్ వద్ద ఖాళీగా ఎలక్ట్రిక్ హోల్డర్ ఉంది. హస్తమిస్తున్న సూర్యుడు ఈ హోల్డర్‌కు సమీపంలో చేరిన సమయంలో తీసిన చిత్రమిది.

– కొవ్వూరు

పసుపు రంగు పుచ్చ.. మార్కెట్లోకి వచ్చె





పోతవరంలో పుచ్చసాగు చేస్తున్న అభ్యుదయ రైతు అట్లూరి వెంకటేశ్వరరావు

నల్లజర్ల: పల్లెల్లో పుచ్చకాయల సందడి ప్రారంభమైంది. ఏటేటా వీటి వినియోగం పెరుగుతోంది. పగటి ఉష్ణోగ్రతలు పెరగడంతో పుచ్చకాయలు హాట్ కేకుల్లా అమ్ముడుపోతున్నాయి. చిన్నారుల నుంచి వృద్ధుల వరకూ పుచ్చకాయలను ఇష్టంగా తింటారు. చలువదనానికి పేరైన పుచ్చ ఇపుడే మార్కెట్లోకి వస్తోంది. కాగా మండలంలోని రైతులు పుచ్చ సాగుపై ఆసక్తి కనబరచడంతో పాటు కొత్త రకాలను మార్కెట్‌కు పరిచయం చేస్తున్నారు. మూడు నెలలు శ్రమిస్తే మంచి ఆదాయం పొందవచ్చని రైతులు చెబుతున్నారు. మండలంలోని ఒక్క పోతవరం పరిసర పొలాల్లో 200 ఎకరాల వరకూ విస్తీర్ణంలో పుచ్చకాయలు సాగవుతున్నాయి. అలాగే శింగరాజుపాలెం, మారెళ్ళమూడి, నల్లజర్ల, దూబచర్ల, అయ్యవరం పరిసర ప్రాంతాల్లో 800 ఎకరాల విస్తీర్ణంలో పుచ్చ సాగు చేస్తున్నారు. పోతవరంలో అభ్యుదయ రైతు అట్లూరి వెంకటేశ్వరరావు రెండున్నర ఎకరాలలో పుచ్చసాగు చేస్తున్నారు. కొత్త రకాలైన విశాల, జనత్ వంటి వాటిని పండించి పట్టణ ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. రహదారి పక్కనున్న తన పొలంలో చిన్నసైజు షాపు పెట్టి హోల్‌సేల్ ధరలకే విక్రయిస్తున్నారు. పసుపు రంగులో ఉండే విశాల రకం పుచ్చకాయలను పట్టణాల్లోని డీ మార్ట్‌లకు పంపి అమ్మకాలు సాగిస్తున్నారు. దీంతో పాటు సీడ్‌లెస్ పుచ్చ కూడా సాగు చేస్తున్నారు.ఎకరానికి 18 నుంచి 20 టన్నుల వరకూ దిగుబడులు వస్తున్నట్టు వెంకటేశ్వరరావు తెలిపారు. పెట్టుబడులు పోను రూ.20 వేల వరకు మిగులుతున్నట్టు చెప్పారు. సామాన్యులకు అందుబాటు ధరలో ఈ పుచ్చ ఉంటుందని తెలిపారు.

కబేళాలో 45 ఎద్దుల స్వాధీనం

ధవళేశ్వరం: గ్రామంలోని క్వారీ రోడ్డు కబేళాలో 45 ఎద్దులను, రెండు కళేబరాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. గోవులను వధిస్తున్నట్టు ఎస్‌పీసీఏ సభ్యులైన విజయ్‌కిషోర్, వైష్ణవ్ దినేష్ ఆదివారం ధవళేశ్వరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సీఐ మంగాదేవి కబేళా వద్దకు చేరుకుని అప్పటికే వధించిన రెండు పశు కళేబరాలను గుర్తించారు. కబేళా నిర్వాహకులు అధిక సంఖ్యలో అక్కడకు చేరడంతో కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది. అక్కడ ఉన్న 45 ఎద్దులను స్వాధీనం చేసుకున్నారు. ఆ కళేబరాలకు పోస్టుమార్టానికి నిర్వహించారు. స్వాధీనం చేసుకున్న ఎద్దులను మండపేట గోసంరక్షణ కేంద్రానికి తరలించారు. ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. పశువులు తరలిస్తున్న వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసును సీఐ కె.మంగాదేవి ఆధ్వర్యంలో ఎస్సై క్రాంతికుమార్ దర్యాప్తు చేస్తున్నారు.